మాట్లాడుతున్న ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు

గ్రామీణ వైద్యులు నిబంధనలు పాటించాలి

మహాముత్తారం, సెప్టెంబర్ 22 : గ్రామీణ వైద్యులు నిబంధనలు పాటించాలని, పరిమితికి మించి వైద్యం చేయొద్దని, ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మీడుదొడ్ల రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్ సూచించారు. ఆదివారం మహాముత్తారం మండలం యమాన్‌పల్లి పరిధిలోని సమ్మక్క, సారలమ్మ గద్దెల ఆవరణలో మండల అధ్యక్షుడు కాసర్ల రాజ్ కుమార్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ పారా మెడికల్ శిక్షణ తరగతులు పునఃప్రారంభం కోసం ఆయా నియోజకవర్గ వర్గాలు, మండలాల్లో ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేయాలన్నారు. గ్రామీణ వైద్యులు ఐక్యంగా ముందుకెళ్తూ హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఈసీ మెంబర్ రవి, లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షుడు రవి, కోశాధికారి సమ్మయ్య, రంగయ్య, రమేశ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పూర్వ విద్యార్థులతో అధ్యాపకులు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 22 : భూపాలపల్లిలోని సిద్ధార్థ జూనియర్ కళాశాల 2004-06 విద్యా సంవత్సరానికి చెందిన సీఈసీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక బీఆర్ఎస్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ బిలుగు రాజేశ్వర్, ప్రిన్సిపాల్ నరసింహస్వామి, డైరెక్టర్లు బానోత్ బాలునాయక్, రెడ్డి రవీందర్, సురేశ్, భాను ప్రకాశ్, అధ్యాపకులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అధ్యాపకులు విద్యార్థులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించి, నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నేడు వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో బానోత్ రాజ్ కుమార్, సత్యనారాయణ, కూనమల్ల తిరుపతి, జిల్లాల తిరుపతి, బుర్ర స్రవంతి పాల్గొన్నారు.

కాళేశ్వరంలో కల్తీ బీర్.. ఒకరికి అస్వస్థత

కల్తీ వచ్చిన బీర్

కాళేశ్వరం, సెప్టెంబర్ 22: కాళేశ్వరం గ్రామంలోని తెలంగాణ వైన్స్‌లో ఆదివారం కలుషిత మద్యం కలకలం రేపింది. రేగొండ మండలం చిన్నకోడెపాక గ్రామానికి చెందిన వారు కాళేశ్వరం గోదావరి నదిలో అస్థికల నిమజ్జనం కోసం రాగా, స్థానిక తెలంగాణ వైన్స్‌లో 24 కింగ్ ఫిషర్ అల్ట్రా బీర్లు తీసుకున్నారు. అందులో రెండు బాటిళ్లలో ఫంగస్ ఉండగా చూడకుండా ఒక బీర్ తాగిన వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. మిగతా బాటిళ్లు గమనించగా మరో బాటిల్‌లో ఫంగస్ కనిపించింది. దీనిపై షాపు నిర్వాహకులను ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తిస్తూ దాడి చేయడానికి ప్రయత్నించారని బాధితులు తెలిపారు జిల్లాలో మేము ఏం చెప్తే అదే నడుస్తుందిని, ఎవరికైనా ఫిర్యాదు చేసుకోమని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు వాపోయారు. అంతలో అక్కడికి చేరుకున్న మీడియాపై షాపు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

సమావేశంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ

ఏటూరునాగారం సెప్టెంబర్ 22 : మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ స్థలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీ తీర్మానం చేసింది. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది నిర్వహించే ఉత్సవాల విషయమై చేయాల్సిన ఏర్పాట్లు, ఇతర అంశాలపై చర్చించారు. అక్టోబర్ 3 నుంచి ఉత్సవాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో స్టార్ యూత్ అధ్యక్షుడు పున్నెం కిరణ్ కుమార్, నిర్వాహకులు చేల్పూరి రామనాథం, వెలకుర్తి లక్ష్మణాచారి, ముక్కెర భిక్షపతి, ఉట్నూరి రాంబాబు, ప్రమోద్, నరేశ్, సందీప్, ప్రశాంత్, శ్యామ్, శ్రీనివాస్, గంజి రమేశ్, లాలయ్య, శిరీష, సుజాత, లావణ్య, సరిత, ప్రసన్న, నాగమణి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331774

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

PLAY SCHOOL TEACHER JOB

★గీజుబాయ్ సెట్విన్ వారి దసరా Pre School టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం (PPTTC) ప్లే వే మెథడ్ బోధన, అక్టోబర్-2 నుండి ప్రారంభం. ట్రైనింగ్‌కి హాజరై SETWIN ద్వారా Govt. సర్టిఫికెట్ & ఉద్యోగం పొందండి. సెల్: 7382733795, 9491818630, HNK.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

చెరువుకు చేరేది సగమే..

- 50 శాతం సీడ్‌కే టెండర్లు
- కోటి చేప పిల్లల తగ్గింపు
- మత్స్యకారుల ఉపాధికి గండి
- వారం రోజుల్లో పంపిణీకి సన్నద్ధం
- అన్నారం, మేడిగడ్డ బరాజ్‌లలో లేనట్లే..

జయశంకర్ భూపాలపల్లి. సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు చేపపిల్లలు చెరువుకు చేరబోతున్నాయి. రెండు నెలలు ఆలస్యంగా టెండర్లు జరుగడం.. అదీ సగం చేపపిల్లల పంపిణీకే టెండర్లు పిలువడంతో మత్స్యకారుల ఉపాధికి గండి పడినట్లయింది. గతంతో పోలిస్తే కోటి పిల్లలను తగ్గించారు. కేవలం 1.42 కోట్ల చేప పిల్లలను మాత్రమే చెరువుల్లో వదిలేందుకు సిద్ధమవుతున్నారు. మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లలో ఈ సారి చేప పిల్లల పంపిణీ చేసే అవకాశాలు కనిపించడం లేదు. కులవృత్తులకు అధిక ప్రాధాన్యమిచ్చి పూర్వవైభవం తీసుకువచ్చిన ఘనత కేసీఆర్ సర్కారుదే. కేసీఆర్ కులవృత్తులను బలోపేతం చేశారు. అయితే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి. ఆగస్టు మొదటి వారంలో చెరువుల్లో చేప పిల్లలను వదలాల్సి ఉండగా రెండు నెలలు ఆలస్యంగా సగం పిల్లలనే పంపిణీ చేస్తున్నారు. దీంతో పిల్లల ఎదుగుదల తగ్గుతుందని మత్స్యకారులు వాపోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా జులై, ఆగస్టులోనే టెండర్లు నిర్వహించి, చేప పిల్లలను చెరువుల్లో వదిలేది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2022-23లో 3 కోట్లు, 2023-24 లో 2.57 కోట్ల చేప పిల్లలను ఆగస్టు మొదటి వారంలోపే చెరువులకు చేర్చి ముదిరాజ్‌ల కళ్లలో ఆనందాన్ని నింపింది.

1.42 కోట్ల సీడ్‌కే టెండర్లు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 832 చెరువుల్లో 1.42 లక్షల సీడ్(చేప పిల్లలు) పంపిణీకి టెండర్లు ఖరారయ్యాయి. కాంట్రాక్టర్ ఐదు శాతం పర్ఫార్మెన్స్ గ్యారెంటీ కింద రూ.6లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బులు చెల్లించిన వెంటనే వారం రోజుల్లో చేప పిల్లలను చెరువుల్లో వదిలేందుకు సిద్ధమవుతున్నారు. భూపాలపల్లి మండలంలో 83 చెరువులు, చిట్యాలలో 82, గణపురంలో 65, కాటారంలో 108, మహదేవపూర్‌లో 59, మహాముత్తారంలో 31, మల్హర్‌లో 46, మొగుళ్లపల్లిలో 113, పలిమెలలో 6, రేగొండలో 153, టేకుమట్ల మండలంలో 86 చెరువుల్లో ఈ చేప పిల్లలను వదలనున్నారు. మొత్తం 832 చెరువుల్లో 35 నుంచి 40మి.మీ. చేపలు 97.03లక్షలు, ఐదు పెద్ద చెరువుల్లో 80 నుండి 100 మి.మీ. చేపలు 49.90 లక్షలు పంపిణీ చేసేందుకు అగ్రిమెంట్ చేసుకున్నారు.

అన్నారం, మేడిగడ్డలో లేనట్లే..

జిల్లాలోని అన్ని చెరువుల్లో కెల్లా మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో పెద్ద ఎత్తున చేప పిల్లలను గత ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసి మత్స్యకారులకు అండగా నిలిచింది. అయితే, మేడిగడ్డ బ్యారేజీలో ఒక పిల్లర్ కుంగడంతో ప్రభుత్వం నీటిని వృథాగా దిగువకు వదిలేస్తోంది. కుంగి ఏడాది సమీపిస్తున్నా మరమ్మతు చేయకపోవడంతో రెండు బరాజ్‌లలో నీటిని నిల్వ చేసే పరిస్థితి లేక చేప పిల్లల పంపిణీ నిలిచిపోయింది.

116 సొసైటీలు..8785 మంది సభ్యులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం 116 సొసైటీలు 8,785 మంది సభ్యులు ఉన్నారు. 833 చెరువుల్లో సీడ్ వేసేవారు. భూపాలపల్లి మండలంలో 17 సొసైటీలు 1221 మంది సభ్యులు ఉన్నారు. చిట్యాలలో 13 సొసైటీలు 1013 సభ్యులు, గణపురంలో 9 సొసైటీలు 1341 సభ్యులు, కాటారంలో 8 సొసైటీలు 356 సభ్యులు, మహదేవపూర్‌లో 7 సొసైటీలు 381 సభ్యులు, మహాముత్తారంలో 3 సొసైటీలు 141సభ్యులు, మల్హర్‌లో 6 సొసైటీలు 574 సభ్యులు, మొగుళ్లపల్లిలో 12 సొసైటీలు 721 సభ్యులు, పలిమెలలో ఒక సొసైటీ 35 సభ్యులు, రేగొండలో 27 సొసైటీలు 2294 సభ్యులు, టేకుమట్లలో 13 సొసైటీలు 708 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాలోని రేగొండ మండలంలో అధికంగా సొసైటీలు, సభ్యులు ఉన్నారు.

సీతారామాలయంలో సుదర్శన మహాయాగం

రామాలయంలో సుదర్శన మహాయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

గణపురం, సెప్టెంబర్ 22 : మండల కేంద్రంలోని పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో శనివా రం సుదర్శన మహాయాగం నిర్వహించారు. అర్చకుడు గోవర్ధన దు ర్వాసచార్యులు, వేద పండితులు, గోవర్ధన వేణుగోపాలాచార్యులు, గోవర్ధన శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో క్రతువు నిర్వహించగా హైదరాబాద్‌కు చెందిన పరాంకుశం శేషాచార్యులు, కృష్ణమాచార్యులు, పరాశరం వెంకటరత్నమాచార్యుల ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం మొత్తం 11 ఆలయాల్లో సుదర్శన మహా హోమం నిర్వహించినట్లు తెలిపారు. స్థానిక ఎస్ఐ రేఖా అశోక్ పాల్గొని పూజలు నిర్వహించారు. వేద పండితులు సముద్రాల సంపత్ కుమార్ ఆచార్యులు, నారాయణ చార్యులు, శ్రవణ్‌కుమార్ శర్మ, ప్రసాదాచార్యులు, అరుణ్ కుమార్ ఆచార్యులు, హరికృష్ణ ఆచార్యులు, లోకేశ్ చార్యులు, విక్రమాచార్యులు, మామిడాల సింహాచారి, ప్రణీతచారి, నందగోపాలాచార్యులు, కోటగుళ్ల అర్చకులు నాగరాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాలు

మహదేవపూర్, సెప్టెంబర్ 22 : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని సూరారం, బెగ్లూర్, పెద్దంపేట, అంబట్‌పల్లి, కుదురుపల్లి, ఎడపల్లి, రాపల్లికోట, బ్రాహ్మణపల్లి, ఎల్‌కేశ్వరం, ఎన్కపల్లి, బొమ్మాపూర్ గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ల వద్ద పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. జీపీ కార్యదర్శులు అంజలిరెడ్డి, దామోదర్‌రెడ్డి, సృజన్, సతీశ్, రాజు, మహేశ్, రమేశ్, కల్పన, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

మంగపేట సెప్టెంబర్22 :మండలంలోని కొత్తమల్లూరుకు చెందిన రెబ్బల రాములు ఇల్లు ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కాగా, తిమ్మంపేటకు చెందిన కళావతి వెల్ఫేర్ సంస్థ అధ్యక్షురాలు చిలకమర్రి కళావతి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బియ్యం, వంట సామగ్రి, దుప్పట్లు, దుస్తులు, దోమె తెరలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఇన్‌చార్జి శివ, సోషల్ వర్కర్ రవి పాల్గొన్నారు.

లైన్‌మన్, మరో ముగ్గురిపై తేనెటీగల దాడి

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 22 : విద్యుత్ లైన్‌మన్‌తోపాటు మరో ముగ్గురిపై తేనె టీగల దాడి చేశాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం భూపాలపల్లి పట్టణంలో విద్యుత్ లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్న తుల అనిల్ ఆదివారం మధ్యాహ్నం విధుల్లో భాగంగా భూపాలపల్లి పట్టణంలోని బాంబులగడ్డ సమీపంలో విద్యుత్ వైర్లను సరి చేస్తున్న క్రమంలో పొదల్లోని తేనె టీగలు ఆయనపై దాడి చేశాయి. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. మరో ముగ్గురిపై కూడా తేనెటీగలు దాడిచేయగా స్థానికులు భూపాలపల్లిలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

'లయన్స్ సేవలను విస్తరిస్తాం'

గొత్తికోయలకు బ్లాంకెట్లను పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వెంకటాపూర్, సెప్టెంబర్ 22 : సామాజిక బాధ్యతలో భాగంగా మారుమూల ప్రాంతాలకు లయన్స్ ఇంటర్నేషనల్ సేవలను విస్తరిస్తామని ఉభయ తెలుగు రాష్ట్రాల లయన్స్‌క్లబ్ ఏరియా లీడర్ దీపక్ భట్టాచార్జీ అన్నారు. ఆదివారం ఆయన లక్ష్మీదేవిపేటలో గొత్తికోయలకు 400 బ్లాంకెట్లను లయన్స్‌క్లబ్ సికింద్రాబాద్ వివేకానందపురం, వరంగల్ క్లబ్ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం దీప్‌భట్టా చార్జీ మాట్లాడుతూ నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ వారు సీఎస్ఆర్ ఫండ్స్ కింద సమకూర్చిన బ్లాంకెట్లను తమ క్లబ్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ములుగు జిల్లాతో పాటు ఆసిఫాబాద్ జిల్లాలోని గొత్తికోయలకు మొత్తం 2వేల బ్లాంకెట్లను అందించనున్నట్లు తెలిపారు. తమ క్లబ్ సభ్యుడైన పింగిలి నాగరాజు సహకారంతో ఐదేళ్లగా ఈ ప్రాంతంలో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీపీసీ జనరల్ మేనేజర్ పాణిగ్రహి, సీనియర్ మేనేజర్ గౌతమ్‌సింగ్ బాటీ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో గాలివాన

నిలిచిపోయిన విద్యుత్ సరఫరా



గోవిందరావుపేట: కురుస్తున్న వర్షం,(ఇన్‌సెట్) వాజేడు : విద్యుత్‌లైన్లు సరిచేస్తున్న సిబ్బంది

వాజేడు/వెంకటాపుర(నూగూరు)/గోవిందరావుపేట, సెప్టెంబర్ 22 : ములుగు జిల్లాలో ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా గాలిదుమారంతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వాజేడు నుంచి జగన్నాథపురం వచ్చే ఫీడర్‌లో విద్యుత్ లైన్లను సరిచేసిన సిబ్బంది సకాలంలో సమస్యను పరిష్కరించి సరఫరాను పునరుద్ధరించారు. అలాగే, వెంకటాపూరం(నూగూరు) మండలంలోని వెంగళరావుపేట గ్రామంలో గాలి వానకు సాధనపల్లి విజయ్‌కుమార్ ఇంటిపై చెట్టు కూలి పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ ప్రమాదంలో ఇల్లు పైకప్పు ధ్వంసమైంది. అలాగే, గోవిందరావుపేట మండలంలో కూడా సాయంత్రం ఒక్క సారిగా భారీ వర్షం పడడంతో అప్పటి వరకు ఎండతో ఉక్కిరిబిక్కిరైన జనానికి చల్లదనంతో ఉపశమనం లభించింది.

సింగరేణి క్రీడాకారులకు ఆటల పోటీలు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 22: భూపాలపల్లి సింగరేణి ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్, గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులకు ఆదివారం భూపాలపల్లి సీఆర్ క్లబ్‌లో ఏరియా స్థాయి క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించినట్లు ఏరియా అధికార ప్రతినిధి కే మారుతిరావు తెలిపారు. క్రీడలను గౌరవ కార్యదర్శి పీ శ్రావణ్ కుమార్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్నా శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వై తిరుమల పర్యవేక్షణలో నిర్వహించినట్లు పేర్కొన్నారు.

కూచిపూడిలో షణ్ముకి ప్రతిభ

షణ్ముకికి జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

గోవిందరావుపేట, సెప్టెంబర్ 22 : కూచిపూడి నృత్యంలో గాంధీనగర్ గ్రామానికి చెందిన తేజవత్ షణ్ముకి ప్రతిభ కనబర్చింది. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నవరం దేవస్థానంలో నిర్వహించిన నృత్య పోటీల్లో షణ్ముకి ప్రతిభ కనబర్చగా నృత్య కళాక్షేత్రం నిర్వాహకులు జ్ఞాపికను అందించారు. వరంగల్ నగరానికి చెందిన శ్రీ భద్రకాళి కూచిపూడి నృత్య కళాక్షేత్రం నిర్వాహకులు సుభాషిణి ఆధ్వర్యంలో నృత్య కళాకారులు షణ్ముకితో పాటు సాత్విక, అన్విక, అక్షయ, ఉషా, ప్రహర్షిణి, షాన్విశ్రీ, అద్భుత, ఆద్య, విన్ను, అక్షయ, సహస్ర, హాసిని, బావహ్య ప్రదర్శనలో పాల్గొన్నారు.

మంద సాంబయ్య ప్రథమ వర్ధంతి

గణపురం,సెప్టెంబర్ 22: మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మంద రాజు తండ్రి మంద సాంబయ్య ప్రథమ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మోత కరుణాకర్ రెడ్డి, భూపాలపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు హాజరై మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొండాపూర్ మాజీ ఎంపీటీసీ మంద అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామంచ భద్రయ్య, ఉమ్మడి కొండాపూర్ మాజీ సర్పంచ్ గంధం ఓధాకర్, నాయకులు వైనాల వెంకటేశ్, శివరాత్రి గణేశ్, ఈర్ల సారయ్య, తోట భద్రయ్య, బోదాసు కొమురయ్య పాల్గొన్నారు.

మట్టి దళారులపై రెవెన్యూ శాఖ పట్టింపేది..?

చిట్యాల, సెప్టెంబర్ 22 : అక్రమంగా గుట్టల్లో మట్టి తవ్వకాలు జరిపే మట్టి దళారులపై రెవెన్యూ శాఖ పట్టింపేదని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య ప్రశ్నించారు. ఆదివారం చిట్యాలలో ఆయన మాట్లాడుతూ నవాబుపేట రెవెన్యూ శివారు వెలిశాల గుట్టల్లో రూ.కోట్ల విలువ గల ఐరన్ మట్టి తవ్వుతున్నా రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. అక్రమార్కులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేశ్ మాదిగ, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి శిలపాక హరీశ్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా సంపత్

మహ ముత్తారం, సెప్టెంబర్ 22 : మండల ఆటో యూనియన్ అధ్యక్షుడిగా పంగ సంపత్‌ను ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. అలాగే, గౌరవ అధ్యక్షుడిగా బుర్రి నరేశ్, వైస్ ప్రెసిడెంట్‌గా జంగిడి సంపత్, కోశాధికారిగా జాడి లక్ష్మణ్, కార్యదర్శిగా చంద్రగిరి రాజబాబు ఎన్నికయ్యారు.

ఆర్గానిక్ పదార్థాలనే వాడాలి

గణపురం,సెప్టెంబర్ 22:రసాయనాలతో తయారు చేసిన ఆహార ఉత్పత్తులను వాడి, ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని, ఆర్గానిక్ ఉత్పత్తులను వాడి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని వెస్టీజ్ యూసీడీ పవన్ దీకొండ అన్నారు. గణపురంలో మామిండ్ల మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెస్టీజ్ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. క్రౌన్ డైరెక్టర్లు కూచన వెంకటేశ్, వెస్టిజ్ ఓనర్ దండిగ దేవేందర్, రేపాక రాజేందర్, మోటపోతుల శివశంకర్ గౌడ్, దూడపాక దుర్గయ్య, బీ కొమురయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

వెస్టీజ్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రామప్పను సందర్శించిన కేంద్రమంత్రి

సినీ నటుడు మధుసూదన్‌రావు



రామప్పలో కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్

వెంకటాపూర్, సెప్టెంబర్ 22 : పాలంపేటలోని రామప్ప దేవాలయాన్ని కేంద్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ సహాయ మంత్రి జార్జ్ కురియన్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో కేంద్ర మంత్రికి ఆశీర్వచనం అందజేసి, శాలువాలతో సత్కరించారు. ఆలయ వి శిష్టతను టూరిజం గైడ్ ద్వారా కేంద్ర మంత్రి తెలుసుకొని మాట్లడుతూ రామప్ప శిల్పకళ అద్భుతంగా ఉందని కొనియాడారు. ఆయన వెంట మాజీ ఎంపీలు గరికపాటి మోహన్‌రా వు, సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, మార్తినేని ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు బలరాం, నాయకులు జవహర్‌లాల్, ఆకిరెడ్డి వెంకట రామ్మోహన్‌రావు, సురేందర్, నాగేశ్వర్‌రావు, వీరస్వామి ఉన్నారు. రామప్పను సినీ నటుడు మధుసూదన్‌రావు, పలువురు అధికారులు, విదేశీయులు కూడా సందర్శించారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేసి ఉల్లాసంగా గడిపారు.

'ఒత్తిడిని దూరం చేసుకోవాలి'

మంగపేట సెప్టెంబర్ 22 : అంతరంగంలో ఒత్తిడిని దూరం చేసుకొని, శాంతిని పెంపొందించుకోవాలని ఏకం ఫౌండేషన్ బాధ్యుడు శ్రీరామ్మూర్తి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తిలోని చైతన్యాన్ని ఉద్దీపనం చేసి, దివ్య జ్ఞానం వైపునకు తీసుకెళ్లేందుకు ఏకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మానసిక స్థైర్యాన్ని ఎలా పెంపొందించుకోవాలి? ఒత్తిడిని ఎలా అధిగమించాలనే అంశాలను వివరించారు.

ఉద్యోగోన్నతుల కోసం కేంద్రమంత్రికి వినతి

కాటారంలో కేంద్ర మంత్రి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కాటారం, సెప్టెంబర్ 22: అర్హులైన ఉపాధ్యాయులకు పీఎస్ హెచ్ఎం ఉద్యోగోన్నతులు కల్పించాలని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు విన్నవించారు. కాటారంలో మంత్రిని ఆదివారం టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు ములుకళ్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి వెంకట్రామ్‌రెడ్డి కలిసి వినతి త్రం అందజేశారు. ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీలుగా పనిచేస్తున్న బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించడానికి వీలుగా ఎన్‌సీటీఈ గైడ్‌లైన్స్‌లో మార్పులు చేయాలని కోరారు. శాసనమండలి సభ్యుల ఎన్నికల్లో ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఓటు హక్కు కల్పించాలన్నారు. జీవో 317 వల్ల జిల్లాలో చాలా మంది ఉపాధ్యాయులు స్థానికత కోల్పోయి కుటుంబాలకు దూరంగా పని చేస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, సత్వరమే వారికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మహదేవపూర్/కాటారం : మహదేవపూర్ మండల కేంద్రంలోని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మంథని రాజేందర్ ఇటీవల పార్టీ సభ్యత్వ నమోదు చేస్తూ గుండె పోటుతో మృతిచెందగా విషయం తెలుసుకున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ గ్రామానికి వెళ్లి మృతుడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే, కాటారం మండలం కొత్తపల్లి గ్రామంలో బీజేపీ నేత పాగె రంజిత్ తండ్రి మల్లయ్య ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శించారు. ఆయన వెంట నిశిధర్ రెడ్డి, చందుపట్ల సునీల్ రెడ్డి, చల్లా నారాయణ రెడ్డి, బండం మల్లారెడ్డి, ఆకుల శ్రీధర్ తదితరులు ఉన్నారు.

రజక సంఘం మండల కమిటీ ఎన్నిక

ములుగురూరల్, సెప్టెంబర్ 22 : రజక సంఘం ములుగు మండల కమిటీని జిల్లా కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నిండ్ల మహేందర్, ఉపాధ్యక్షులుగా గూడెల్లి ఓదేలు, మామిడాల భిక్షపతి, రాయకంటి కుమారస్వామి, రావుల లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శులుగా కొమురాజు వెంకన్న, కత్తెరపల్లి సంపత్, కార్యదర్శులుగా పైడిపల్లి కుమారస్వామి, కాసర్ల సారయ్య, కోశాధికారిగా కొత్తపల్లి దయాకర్, జిల్లా సమన్వయ కమిటీ సలహాదారులుగా నేరెళ్ల శంకర్, జాలిగం శ్రీనివాస్, మొగుళ్ల భద్రయ్య, సభ్యులుగా నగరపు రమేశ్, గుమ్మడిపల్లి లక్ష్మయ్య, పావురాల భిక్షపతి, కాశిరాజు రమేశ్, నాంపల్లి స్వామి ఎన్నికయ్యారు. పట్టణ అధ్యక్షుడు పీ రవి, చాపర్తి రాజు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రేగొండ, సెప్టెంబర్ 22 : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ఓ పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం దగ్ధమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన స్వప్న వ్యవసాయ పనుల నిమిత్తం ఆదివారం బయటకు వెళ్లగా షార్ట్ సర్క్యూట్‌తో ఇంటికి మంటలు అంటుకున్నాయి. గమనించిన చుట్టుపక్కల వారు స్వప్నకు సమాచారం అందించారు. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా పూర్తిగా కాలిపోయింది. వ్యవసాయ పెట్టుబడి కోసం ఇంట్లో దాచిపెటుకున్న రూ.50వేల నగదుతో పాటు సామగ్రి పూర్తిగా కాలి పోయాయని, మొత్తం రూ. 2లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కొనసాగుతున్న అటవీ అధికారుల సర్వే

తాడ్వాయి, సెప్టెంబర్ 22 : ఇటీవల సుడిగాలి సృష్టించిన బీభత్సంతో ధ్వంసమైన అడవిలో జరిగిన నష్టంపై అధికారులు చేపడుతున్న సర్వే కొనసాగుతోంది. ఆదివారం సైతం అధికారులు నేలమట్టమైన చెట్లను లెక్కించి, నంబరింగ్ వేశారు. ఏటూరునాగారం మండలం దొడ్ల గ్రామం నుంచి తాడ్వాయి కొండపర్తి వరకు చెట్లు కూలిపోగా, నష్టం అంచనా వేసేందుకు శ్రమిస్తున్నారు. సుమారు 500 ఎకరాల్లో అడవి ధ్వంసమైనట్లు గుర్తించి, నష్టంపై అంచనాకు వచ్చేందుకు సర్వే చేస్తున్నారు. 200 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబర్ 22 : ములుగు జిల్లా కేంద్రంలోని కోర్టులో ఈ నెల 28న జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై తిరుపతిరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కేసులు రాజీ కుదుర్చుకునే ఇరు వర్గాల వారు పీఎస్‌ను సంప్రదించాలని సూచించారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

ములుగు రూరల్, సెప్టెంబర్ 22 : చట్ట వ్యతిరేకంగా వసూళ్లకు పాల్పడితే పోలీస్ శాఖ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వాహనదారుల వద్ద పోలీస్, ప్రెస్ పేరుతో నకిలీ వ్యక్తులు అక్రమ వసూళ్లకు పాల్పడగా కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇకపై ఎవరైనా వాహనదారులను భయపెట్టే ప్రయత్నం చేస్తే 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

'ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి'

ములుగు రూరల్, సెప్టెంబర్22 : రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నుంచి విడుదలైన వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రొసీడింగ్ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హట్కర్ సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖను బలోపేతం చేస్తామని చెబుతూనే అశాస్త్రీయ విధానాలకు తెరలేపుతోందని ఆరోపించారు. విద్యాశాఖ ఆదేశాలు అసంబద్ధంగా ఉన్నాయని, ఎస్‌జీటీలను వెంటనే రిలీవ్ చేయాలని, సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలని కోరారు.

ఆదివాసీ యువజన సంఘాల సమావేశం

తాడ్వాయి, సెప్టెంబర్ 22 : మండలంలోని మేడారంలో ఆదివాసీ మ్యూజియం ఆవరణలో ఆదివారం ఆదివాసీ యువజన సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గిరిజన అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి మండలంలోని పలు గ్రామాల ఆదివాసీ యువకులు పాల్గొన్నారు. విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు కొర్నిబెల్లి గణేశ్ మాట్లాడుతూ ఆదివాసీ యువత హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆదివాసీ విద్యార్థులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ కుర్సం రవి సూచించారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ హెల్పర్ మృతి

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబర్ 22 : అనారోగ్యంతో అంగన్‌వాడీ హెల్పర్ మంగమ్మ(62) మృతి చెందారు. విషయం తెలుసుకన్న సీడీపీవో ముత్తమ్మ చర్పిపేట గ్రామానికి చేరుకొని మంగమ్మ మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. దహన సంస్కారాల నిమిత్తం ప్రభుత్వం నుండి వచ్చే రూ.10వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆమె వెంట సూపర్‌వైజర్ చంద్రకళ, టీచర్ ఉన్నారు.

వార్డు మాజీ మెంబర్..

రాములమ్మ(ఫైల్)

తాడ్వాయి : మండలంలోని నార్లాపూర్ పంచాయతీ పరిధిలోని ఎల్బాక వార్డు మాజీ సభ్యురాలు జజ్జెర రాములమ్మ(60) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారు జామున మృతి చెందింది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె దావాఖానల్లో చికిత్స పొందినా ఫలితం లేదు. రాములమ్మ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి: సీఐ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ నరేశ్‌కుమార్

కృష్ణ కాలనీ, సెప్టెంబర్ 22 : పట్టణంలోని ప్రతి కాలనీలో ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని భూపాలపల్లి సీఐ నరేశ్ కుమార్ సూచించారు. భూపాలపల్లిలోని జవహర్‌నగర్ కాలనీలో ప్రజలు ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోగా, ఆదివారం సీఐ నరేశ్ కుమార్ వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్, మాజీ వైస్ చైర్మన్ ఎరుకల గణపతి, కాలనీవాసులు తిరుపతి, రవికుమార్ పాల్గొన్నారు.